ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 31 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆది) సా.6.24
సహరీ (సోమ) ఉ.4.36

ఎండా కాలమ్
	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	34	26



నీరాజనం : ప్రజలకు అభివాదం చేస్తున్న పవన్

పవన్ కోసం ఎదురుచూపులు

నేను మీ వాడిని : పవన్ అభివాదం

పిఠాపురాన తొలి రోజు ప్రచార సభకు పోటెత్తిన జనప్రవాహం

అన్నా.. నీ కోసమే..

జన..పవన్..

ఆశీర్వదించండి..పిఠాపురాన లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించండి

- నియోజకవర్గాన్ని తీర్చిదిద్దే బాధ్యత నాది
- రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా చేస్తా
- ఇక్కడే స్థలం కొంటా.. ఇల్లు కట్టుకుంటా
- నన్ను ఓడించేందుకు వైసీపీకి ఎందుకంత కక్ష
- ఓట్లకు వచ్చే వైసీపీ నేతలను నిలదీయండి
- తొలిరోజు ప్రచార సభలో నిప్పులు చెరిగిన పవన్







పవన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉదయ్ శ్రీనివాస్, పంతం నానాజీ, కొత్తపల్లి సుబ్బారాయుడు

(కాకినాడ- ఆంధ్రజ్యోతి), పిఠాపురం, గొల్లప్రోలు రూరల్, మార్చి 30 : 'పిఠాపురం నియోజకవర్గానికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. దేశం గర్వించదగ్గ ఆలయాలు ఇక్కడే ఉన్నాయి. ఒక పక్క పోర్టులు, సెజ్, సముద్రం, హైవే ఇన్ని ఉన్నా నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయింది. అందుకే పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. ప్రతి మండలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు తీసుకువస్తా. నాకు ఎందరో వైద్యులైన స్నేహితులు ఉన్నారు. వారితో ఇక్కడ ఆస్పత్రులు నెలకొల్పేలా చేస్తా. కాకినాడ సెజ్‌లో పరిశ్రమలు తీసుకువచ్చేలా చేస్తా. ఒకసారి ఈప్రాంతం నాది అనుకున్నానంటే దాని అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తా. పిఠాపురంలో ఉన్న ఆలయాలను అన్నింటినీ కలిపి టెంపుల్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తా. అందుకే నేను ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నానని తెలిసి వైసీపీ నన్ను ఓడించడానికి ఎన్ని కుట్రలు పన్నాలో అన్నీ పన్నుతోంది. నాపై ఎందుకు ఇంత కక్ష. మీరంతా అండగా ఉన్నారనే నాపై ఇన్ని వ్యూహాలు అమలు చేస్తోంది. అందుకే చేతులు జోడించి అభ్యర్థిస్తున్నా. పిఠాపురం నుంచి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపండి. లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించండి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి పవన్ పిఠాపురం నియోజకవర్గంలో శనివారం నుంచి పర్యటన ప్రారంభించారు. నాకు ఇష్టమైన దత్తాత్రేయుడి సాక్షిగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాను. ఎలా చేస్తాను అనే సందేహం మీలో చాలా మందికి ఉండొచ్చు. అనుభవజ్ఞుడైన టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ సహకారం, ఇతర నేతలతో నియోజకవర్గాన్ని ముందుకు నడిపిస్తా. ఇక్కడున్న ఆలయాలను కేంద్రంతో మాట్లాడి ప్రత్యేక పథకం కింద నిధులు తెస్తాను. ఉప్పాడ కోత నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతాను. కానీ వైసీపీ వాళ్లు ఇవేవీ చేయలేదు. నేను పోటీ చేస్తున్నాను అనగానే నేతలందరూ ఊరూరా తిరుగుతున్నారు. ఎందుకు ఇన్నాళ్లు ఈ ప్రాంతాన్ని వాళ్లు అభివృద్ధి చేయలేదు. వంగా గీత వస్తే ఇదే నిలదీయండి. సెజ్‌లో పరిశ్రమలు ఎందుకు లేవని అడగండి. అరబిందో చేపడుతున్న పైపులైన్ కాలుష్యం గురించి నిలదీయండి. జెట్టీలు ఎందుకు లేవో అడగండి. వైసీపీది అంతా బెదిరింపుల రాజ్యం. కాకినాడలో రెండు పోర్టులను అరబిందో ద్వారా అధికార పెద్దలు లాగేసుకున్నారు. కాకినాడ పోర్టులో కంటైనర్లలో డబ్బులను వైసీపీ నేతలు దాచారు. జిల్లాలో ఉన్న మాఫియా డాన్ చెరువుల్లో మట్టి, బొండు ఇసుక, పోర్టు భూములు ఇలా అన్నింటిని మింగేశాడు. అతడి పేరు పలకడం కూడా నాకు ఇష్టం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వీరి సంగతి చూద్దాం. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇక్కడ అన్నివర్గాల సమస్యలు తీరుస్తా. చేనేత, మత్స్యకారుల సమస్యల దగ్గర నుంచి యువతకు స్కిల్ సెంటర్లు, మిర్చి రైతుల కష్టాలు, సంతకు మౌలిక వసతులు ఇలా అన్ని సమస్యలు పరిష్కరిస్తాను. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అమాయకులైన ప్రజల భావోద్వేగాలతో ఇంతవరకు నేతలు ఆడుకున్నారు. కానీ నేను అలా కాదు. బాధ్యతతో వ్యవహరించి ఇక్కడి ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటాను. అందుకే నన్ను ఆశీర్వదించండి. అసెంబ్లీకి పంపండి.'అని పవన్ కోరారు. పవన్ ఉదయం నుంచి జ్వరంతో బాధపడు తున్నారు. ఆయన ఆదివారం పుర్హూతికా అమ్మవారిని దర్శించుకుని వారాహికి పూజలు చేస్తారు. పర్యటనలో కాకినాడ ఎంపీ కూటమిఅభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వర్మ, బీజేపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా కృష్ణరాజు ఉమ్మడి శ్రేణులు పాల్గొన్నారు.



అడుగడుగునా నీరాజనం.. పోలీసుల వైఫల్యం

తొలిరోజు పవన్‌కు అడుగడుగునా నీరాజనం పలికారు.సరిగ్గా మధ్యాహ్నం 12.40 గంటలకు గొల్లప్రోలులో హెలీప్యాడ్ వద్ద దిగారు. అక్కడ టీడీపీ, జనసేన నేతలు పవన్‌కు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పుర్హూతికా అమ్మవారి దర్శనానికి వెళ్లాల్సి ఉండగా సమయాభావంవల్ల ఆలయం మూతపడింది. దీంతో దొంతమూరులో మాజీ ఎమ్మెల్యే వర్మ ఇంటికి వెళ్లి సుమారు గంట సేపు గడిపారు. అనంతరం పవన్ నేరుగా హోటల్‌లో బస ప్రాంతానికి చేరుకున్నారు. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు జగ్గంపేట నుంచి వచ్చిన ఉద్యమనేత తుమ్మలపల్లి రమేష్ పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. అనంతరం పుర్హూతికా అమ్మవారి ఆలయానికి వెళ్లి అక్కడే వారాహికి పూజలు చేద్దామని పవన్ భావించారు. తీరా వారాహికి ఎన్నికల ప్రచార రథం కింద అనుమతులు లేవని అధికారులు అభ్యంతరం చెప్పడంతో దర్శనం కూడా రద్దు చేసుకున్నారు. అక్కడి నుంచి చేబ్రోలుకు బయలుదేరారు. దారిపొడవునా వందలాది జనం పవన్ వెంట నడిచారు. హారతులు పట్టారు. రాత్రి 8 గంటలకు చేబ్రోలుకు చేరుకునేసరికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ వారాహికి అనుమతులు జారీ చేసింది. దీంతో అప్పటికప్పుడు వారాహి ఎక్కి ప్రజలకు అభివాదం చేసుకుంటూ 8.30 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికే వేలాది మంది పవన్ రాక కోసం చూడడం, అదే సమయంలో వారాహి ముందుకు కదలడంతో ఒక్కసారి అనుకోకుండా తొక్కిసలాట చోటుచేసుకుని పలువురికి గాయాలయ్యాయి. ఆ తర్వాత పవన్ వారాహిపైకి ఎక్కి దాదాపు గంట సమయం ప్రసంగించడంతో అభిమానులు ఆనందంతో మునిగిపోయారు. పవన్‌కల్యాణ్ సభ సమయంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. ఉదయం 150 మంది పోలీసులతో భద్రత ఉంటుందని తెలియజేసినా రాత్రికి 20మంది కూడా లేకపోవడం గమనార్హం. దీనివల్లే తొక్కిసలాట జరిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



మీ భవిష్యత్‌కు నేనున్నా : వర్మ కుటుంబీకులతో జనసేన అధినేత పవన్

వర్మకు అండగా ఉంటా..

పిఠాపురంలో పవన్‌కల్యాణ్

పిఠాపురం/పిఠాపురం రూరల్, మార్చి 30: పొత్తులో భాగంగా తన కోసం సీటు త్యాగం చేసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మను భవిష్యత్తులో బలమైన స్థానంలో నిలుపుతామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన అనంతరం నియోజకవర్గానికి శనివారం తొలిసారి పవన్ వచ్చారు. హెలికాప్టర్ దిగి నేరుగా పిఠాపురం మండలం పి.దొంతమూరులోని వర్మ నివాసానికి చేరుకున్నారు. తప్పెటగుళ్ల బాణ సంచా కాల్పులు, డప్పుల వాయిద్యాలతో పవన్‌కు స్వాగతం పలికారు.వర్మను ఆలింగనం చేసుకుని సత్కరించారు. వర్మ సతీమణి లక్ష్మీదేవి పవన్‌కు హారతులు ఇచ్చారు. అనంతరం కుమారుడు గిరీష్, ఇతర కుటుంబీకులతో మాట్లాడారు. వర్మ తల్లి అలివేలు మంగ పద్మావతి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వర్మ, జోన్-2 ఇన్‌చార్జి, మాజీ మంత్రి సుజయ కృష్ణరంగారావుతో అరగంటకు పైగా సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులు, పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై చర్చించారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం సాధించబోతున్నదన్నారు. దానికి సంకేతమే పిఠాపురం నియోజకవర్గంలో లభిస్తున్న అపూర్వ స్పందన అన్నారు. తన విజయం కోసం నేనున్నాంటూ నిలబడిన వర్మకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వర్మకు అన్ని విధాలా అండగా ఉంటానని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం కుటుంబం తరపున పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్నామని తెలిపారు.తన కంటే పదిరెట్లు అధికంగా కష్టపడి పవన్ విజయం కోసం పనిచేస్తామని చెప్పారు. పిఠాపురంలో టీడీపీ, జనసేన జెండా ఎగరాలన్నారు.కార్యక్రమంలో కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మీ విజయం ఖాయం : పవన్‌ను ఆశీర్వదిస్తున్న పండితులు



మా సమస్యలు వినన్నా : పవన్ కోసం వచ్చిన పట్టు పరిశ్రమ రైతులు

లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై

ప్రత్యేక దృష్టి : జేసీ



అమలాపురం టౌన్, మార్చి 30: లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ ఆదేశించారు. అబార్షన్లు చేస్తున్న ఆసుపత్రులపై దృష్టి సారించాలన్నారు. ఆడశిశువు పట్ల వివక్షతతో కొనసాగుతున్న భ్రూణహత్యల నివారణకు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని ఆమె సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జేసీ అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం, రూల్స్ 1996 యాక్టు సరోగసీ అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన గర్భస్థ పిండ పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే అపరాధ రుసుం విధించాలని స్పష్టంచేశారు. సమీక్షలో డీఐవో డీవీవీ సత్యనారాయణ, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, డాక్టర్ సుమలత, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, డాక్టర్ పీఎస్ శర్మ, జనకల్యాణ్ సంస్థ ప్రతినిధి జి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



గోపాలపురంలో వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

బోర్డరు చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా కెమెరాలు : ఎస్పీ

అమలాపురం, మార్చి30(ఆంధ్రజ్యోతి): అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లాలో బోర్డరు చెక్‌పోస్టుల వద్ద నిరంతర వాహనాల తనిఖీలు కొనసాగిస్తున్నట్టు జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. బోర్డర్ చెక్‌పోస్టుల వద్ద నిఘా కెమెరాలు ఏర్పాటుచేశామన్నారు. బోర్డరు చెక్‌పోస్టుల్లో తనిఖీ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బోర్డరు చెక్ పోస్టులను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రావులపాలెం పోలీసుస్టేషన్ పరిధిలోని గోపాలపురం, ఆలమూరు పీఎస్ పరిధిలోని జొన్నాడ, ఆత్రేయపురం పీఎస్ పరిధిలోని బొబ్బర్లంక బోర్డరు చెక్‌పోస్టును ఎస్పీ తనిఖీ చేశారు. తనిఖీ సిబ్బంది వాహనాలను ఏవిధంగా తనిఖీ చేస్తున్నారో స్వయంగా పరిశీలించారు. సిబ్బంది ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, వాహన డ్రైవర్లు, యజమానులతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలని, ఏదైనా అనుమానం వస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ తదితరులున్నారు.

కడితేనే.. కరెంటు!

పంచాయతీలకు ట్రాన్స్‌కో గట్టి షాకిచ్చింది. తక్షణం బకాయిలను కట్టాలని ఇప్పటికే ఆదేశాలిచ్చిన ఆ శాఖ ఉన్నతాధికారులు శనివారం ప్రత్యక్ష చర్యలకు దిగారు. జిల్లాలోని పలు గ్రామ పంచాయతీ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అలాగే సచివాలయాలకూ కరెంటు నిలిపివేశారు. దీంతో ఆయా కార్యాలయాల కార్యకలాపాలకు విఘాతం ఏర్పడింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సదరు బకాయిలను రాబట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది. వాస్తవానికి ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను చేయించడంతోపాటు పాత బిల్లులను క్లియర్ చేస్తుండగా, నిధులను అధిక భాగం కరెంటు బిల్లుల పేరుతో ప్రభుత్వం తన ఖాతాలో వేసుకునేందుకు పన్నాగం వేసిందని సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు.

పవర్ కట్.. ట్రాన్స్‌కో షాక్

పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

- ఆమలాపురం

అంబాజీపేట మండలంలో రూ.26 లక్షలు చెల్లించాలని ట్రాన్స్‌కో అల్టిమేటం

అంబాజీపేట, మార్చి30: పంచాయతీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ట్రాన్స్‌కో అధికారులు పంచాయతీ కార్యాలయాలకు పవర్‌కట్ చేశారు. ప్రభుత్వం రెండు దఫాలుగా 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు జమచేసింది. అయితే ఆ నిధులను పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయా సర్పంచ్‌లు ఇప్పటికే కొంతమేర కేటాయించారు. అయితే ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు పంచాయతీలు, వీధిలైట్ల బిల్లులు చెల్లించాలని నోటీసులు జారీచేశారు. మండలంలో 16 గ్రామ పంచాయతీలకు రూ.32 లక్షలకు పైగా బకాయిలు ఉన్నాయి. మాచవరం, గంగలకుర్రు, ఇరుసుమండ, మొసలపల్లి, నందంపూడి, పసుపల్లి గ్రామాలు కొంత మొత్తాన్ని చెల్లించడంతో ఆ గ్రామాలకు విద్యుత్‌ను అందించారు. మిగిలిన పది గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. తక్షణం రూ.26 లక్షల బకాయిలు కట్టాలని ట్రాన్స్‌కో అల్టిమేటం ఇచ్చింది.

సచివాలయాలకూ పవర్ కట్

పి.గన్నవరం, మార్చి 30: గ్రామ సచివాలయాలకు విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో శనివారం ట్రాన్స్‌కో సిబ్బంది ఫీజులు తొలగించారు. పి.గన్నవరం మండలంలో 20 గ్రామాల్లో ఉన్న పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల పరిధిలో వీధి దీపాల విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మండల వ్యాప్తంగా రూ.45 లక్షల విద్యుత్ బకాయిలను పంచాయతీలు, సచివాలయాలు చెల్లించాల్సి ఉంది. ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈ బిల్లులు చెల్లించాల్సి ఉందని, వెండర్ ఐడీకి అనుమతులు ఇంకా రాకపోవడంతో బిల్లులు చెల్లింపు జాప్యం జరిగినట్టు పంచాయతీ కార్యదర్శులు చెప్పుకొస్తున్నారు. దీంతో కార్యాలయాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మలికిపురం పంచాయతీలకు విద్యుత్ బంద్

మలికిపురం, మార్చి 30: మలికిపురం మండలంలో రెండు పంచాయతీలు మినహా మిగిలిన అన్ని పంచాయతీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్టు అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.సతీష్ శనివారం తెలిపారు. గుబ్బలపాలెం, జి.పల్లిపాలెం పంచాయతీలు వీధి లైట్ల బిల్లులు చెల్లించగా మిగిలిన పంచాయతీలు రూ.27 లక్షల 23 వేలు బకాయి ఉన్నట్టు సతీష్ తెలిపారు. పై అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీలకు విద్యుత్‌ను నిలిపివేసినట్టు ఆయన చెప్పారు.



ప్రచార రథం కదిలింది..

కూటమి ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురుచూపులు

- రాజోలు

అంతర్వేది దేవస్థానం నుంచి ప్రచారాన్ని ప్రారంభించిన హరీష్‌మాధుర్, దేవ



సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన బాలకృష్ణ

వైసీపీ తీర్థం తీసుకున్న పితాని బాలకృష్ణ

ముమ్మిడివరం, మార్చి 30: జనసేన పార్టీ రాష్ట్ర మాజీ పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ శనివారం వైసీపీలో చేరారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు, ఆయన అనుచరులతో కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలో సిద్ధం బస్సు యాత్రలో ఉన్న సీఎం జగన్ సమక్షంలో బాలకృష్ణ వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. అక్కడి నుంచి పలు వాహనాలు భారీ ర్యాలీగా ముమ్మిడివరం నియోజకవర్గానికి తరలివచ్చారు. పితాని బాలకృష్ణ వెంట తరలివెళ్లిన వారిలో వైసీపీ నేతలు పెన్మెత్స చిట్టిరాజు, చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెయ్యల చిట్టిబాబు, డిల్లీ నారాయణ, కోలా బాబ్జి తదితరులు ఉన్నారు.



పితాని వైసీపీ చేరిక కార్యక్రమంలో వలంటీరు

వైసీపీ సేవలో వలంటీరు

ముమ్మిడివరం, మార్చి30: కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలో సీఎం జగన్ సమక్షంలో బాలకృష్ణ పార్టీలో చేరారు. కార్యక్రమానికి తరలివెళ్లిన నాయకులతో ముమ్మిడివరం నగర పంచాయతీ సూరాయి చెరువు 4వ సచివాలయం వలంటీరు నాగార్జున పాల్గొన్నారు. దీనిపై శనివారం నగర పంచాయతీ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డికి ఫిర్యాదు అందినట్టు సమాచారం.

ముగ్గురు వలంటీర్లు తొలగింపు

అల్లవరం, మార్చి 30: గుడాలలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముగ్గురు వలంటీర్లను విధుల నుంచి తొలగిస్తూ ఆర్డీవో కేశవర్ధనరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. వలంటీర్లు ములపర్తి వెంకటేశ్వరరావు, ములపర్తి నాగార్జున, మోకా రవితేజలు ఎన్నికల కమిషన్ ఆదేశాలు ధిక్కరించి వైసీపీ ప్రచారంలో పాల్గొనందుకు వారిని విధుల నుంచి తొలగించారని కార్యదర్శి ఎఎస్‌వీ రాజేశ్వరరావు తెలిపారు.

పవర్ కట్





ట్రాన్స్‌కో షాక్

పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

- మొండి బకాయిలపై చర్యలు ప్రారంభించిన ట్రాన్స్‌కో
- సుమారు రూ.350 కోట్ల బకాయిల వసూలుకు రంగంలోకి
- చెల్లింపునకు ఎటువంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం
- పైగా ఆ డబ్బులను సైతం ప్రభుత్వ పథకాలకు మళ్లింపు
- పంచాయతీల ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం
- అడిగి..అడిగి..విసిగిపోయిన ట్రాన్స్‌కో
- ఎట్టకేలకు చర్యలు ప్రారంభం
- అంధకారంలో పంచాయతీ కార్యాలయాలు
- విద్యుత్ సరఫరా లేక మంచినీటి కుళాయిలన్నీ బంద్

రాజమహేంద్రవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అటు ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఇటు పంచాయతీల అలసత్వంతో విసిగిపోయిన ట్రాన్స్‌కో 'పవర్' బెత్తం ఝుళిపించింది. ప్రభుత్వ కార్యాలయాల బిల్లుల వసూలు కోసం దండం పట్టుకోక తప్పలేదు. విద్యుత్ షాక్‌తో గతంలో ఎప్పుడూ లేని విధంగా గ్రామాల్లో వీధిలైట్లు ఆరిపోయాయి. నీతులు చెప్పే పాలకుల తీరుతో గ్రామాల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ (విద్యుత్ పంపిణీ సంస్థ) సర్కిల్ పరిధిలోని తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలోని పలు మండలాల్లోని వీధులు అంధకారంలోకి వెళ్లక తప్పలేదు. పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు కోట్లాది రూపాయలు బకాయి పడడంతో విద్యుత్ పంపిణీ సంస్థ మనుగడ, గ్రామాల్లో వీధి లైట్లు నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారుతోందని నాలుగు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన సంగతి గమనార్హం.

పేరుకుపోయిన బకాయిలు

పంచాయతీలు గ్రామాల్లో వీధిలైట్లు, మంచినీటి సరఫరాకు విద్యుత్‌ని వినియోగిస్తాయి. అయితే టీడీపీ ప్రభుత్వంలో ఆ బిల్లులను నేరుగా విద్యుత్ పంపిణీ సంస్థలకు నగదు జమ చేసేవారు. కానీ, వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్ని వ్యవస్థల మాదిరిగా విద్యుత్ పంపిణీ వ్యవస్థ కూడా అతలాకుతలమైంది. పంచాయతీలే ఆ విద్యుత్ బిల్లులను చెల్లించుకోవాలని స్పష్టం చేసింది. దీంతో గ్రామాల్లోని వీధిలైట్లు, మంచినీటి సరఫరా ఇబ్బందుల్లో చిక్కుకున్నాయి. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంటును (అప్పుకాదు.. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు) కూడా దారి మళ్లించి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల పేరుచెప్పి పంచేయడంతో కనీసం కరెంటు బిల్లులు చెల్లించలేని స్థితిలో పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. అయితే కరెంటు సరఫరా నిలిపివేస్తే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో విద్యుత్ పంపిణీ సంస్థ ఈ నాలుగేళ్లుగా కష్టాన్ని భరిస్తోంది. ఆ మంచితనం ఖరీదు కోట్లాది రూపాయలకు పేరుకుపోవడంతో బెత్తం తీయక తప్పలేదు.

బకాయిలు సుమారు రూ.350 కోట్లు

జిల్లాలను విభజించినా విద్యుత్ సర్కిల్ మాత్రం ఇంకా విభజన కాలేదు. తూర్పు, కోనసీమ, కాకినాడ జిల్లాలు, ఏజెన్సీలోని కొంత ప్రాంతం రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలో ఉన్నాయి. వీటి సంబంధించి(ఉమ్మడి తూర్పు) 1029 పంచాయతీలు ఉన్నాయి. గత నెల 29 వరకూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో పంచాయతీలు రూ.9,14,48,198.. తూర్పు రూ.149,38,34,662.. కాకినాడ రూ.94,83,51,858.. కోనసీమ రూ.29,46,49,471.. మొత్తం కలిపి 282 కోట్ల 82 లక్షల 84 వేల 189 రూపాయల బిల్లులు పేరుకుపోయాయి. అయితే, ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు తెరవెనుక పనులు తెలియకూడదనే ఉద్దేశంతో కేవలం గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి అంటే 11 నెలల బిల్లులను మాత్రమే వసూలు చేసుకోవాలని విద్యుత్ పంపిణీ సంస్థకు ప్రభుత్వం హుకుం జారీ చేసినా పంచాయతీల్లో నిధుల్లేక ఫలితం లేకపోయింది. ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న పంచాయతీలు కూడా పైసలు విదల్చలేదు. ఇక, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఉమ్మడి తూర్పులో రూ.74 కోట్ల 42 లక్షల రూపాయలు కరెంటు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఆర్డీవో స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా ఉన్న పంచాయతీలు సైతం బిల్లులు చెల్లించలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. కాగా.. కరెంటు సరఫరా నిలిపివేయడంపై తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారి రాంబాబును వివరణ కోరగా.. తన దృష్టికి అలాంటి సమస్య రాలేదని కానీ, రెండు రోజుల్లో బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామనడం గమనార్హం

ఎందుకు ఊరుకున్నారు..

కరెంటు బిల్లు రూ.150 చెల్లించకపోతే ఠంచనుగా ఫీజు పీకేస్తారు. మరి కోట్లాది రూపాయల బకాయిలు ఉండగా ఎందుకు ఊరుకున్నారనే సందేహం సామాన్యుడి బుర్రను తొలిచేయవచ్చు. దానికి ఏకైక కారణం వైసీపీ పాలకులు అని చెప్పక తప్పదు. గ్రామాలకు విద్యుత్ నిలిచిపోతే పాలకుల చేతగానితనం బయట పడుతుందనే ఉద్దేశంతో కింది స్థాయిలోని ఏఈ నుంచి ఉన్నత స్థాయిలోని సీఎండీ వరకూ బెదిరింపులతో కాలం నెట్టుకొచ్చారు. ఇప్పుడు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో తాము నలిగిపోతున్న విషయంపై ప్రజలకు నిజం తెలియజేయాలని విద్యుత్ పంపిణీ సంస్థ పూనుకొంది. దీంతో గ్రామాల్లో లైట్లు ఆరిపోయాయి. కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం, మలికిపురం, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లోని పంచాయతీల ఫీజు పీకేశారు.

జీతానికి, బిల్లుకు లంకె..

గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం వ్యవహరించడంతో విద్యుత్ పంపిణీ సంస్థ ఇబ్బందుల్లో పడింది. విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి విద్యుత్‌ని కొనుగోలు చేసి ప్రజలకు విద్యుత్ పింపిణీ సంస్థలు సరఫరా చేస్తాయి. విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు అడ్వాన్సుగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వ హామీ మేరకు ప్రజలకు విద్యుత్ పంపిణీ సంస్థలు సరఫరా చేస్తాయి. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల బిల్లులు పేరుకుపోవడంతో విద్యుత్ పంపిణీ సంస్థ క్రమంగా నష్టాల్లోకి జారుకొంది. గత ప్రభుత్వంలో ఒకటో తారీఖున జీతాలు ఇచ్చేది. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక జీతాలు ఒకటో తారీఖున కాకుండా 20వ తారీఖు వరకూ ఖాతాకు జమవుతున్నాయి. ఈ జాప్యంపై ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే బకాయిలను వసూలు చేసుకొని జీతాలు తీసుకోవాలని మౌఖికంగా హుకుం కూడా జారీ చేయడంతో.. అటు ప్రభుత్వ బకాయిలను గట్టిగా అడగలేక ఇటు బిల్లులు వసూలు కాక మానసికంగా ఉద్యోగులు తీవ్ర ఆవేదన అనుభవిస్తున్నారు.

నో పవర్

ప్రభుత్వ నిర్లక్ష్యానికి దక్కిన ఫలితం

ఆత్రేయపురం, మార్చి 30: గ్రామ పంచాయతీలకు ట్రాన్స్‌కో 'పవర్' షాక్ ఇచ్చింది. శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీలకు ట్రాన్స్‌కో సర్వీసులు తొలగించడంతో గ్రామాలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ట్రాన్స్‌కో వైఖరిపై సర్పంచ్‌లు మండిపడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి 30 శాతం నిధులు ఈసీఐఎల్, నెడ్‌క్యాప్, పీడబ్ల్యుఎస్ పేరుతో చార్జీలు వసూళ్ల చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో సర్పంచ్‌లు, కార్యదర్శులు సతమతమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలకు గత ఆగస్టు నెలలో రూ.700కోట్లు, ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.700 కోట్లు 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు జమయ్యాయి. గత ఏడాది కాలం నుంచి పంచాయతీలకు ఎటువంటి ఆదాయం లేకపోవడంతో ఖర్చుపెట్టిన బిల్లులు చెల్లించేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీల నిధుల నుంచి వీధి లైట్ల నిర్వహణ చార్జీల పేరుతో 10 శాతం, గ్రామ పంచాయతీ అంగన్‌వాడీ, నెడ్‌క్యాప్ బిల్లుల పేరుతో 10 శాతం, గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా నిర్వహణకు టైడ్ గ్రాంటు నుంచి 10 శాతం నిధులు బలవంతంగా వసూలు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం ట్రాన్స్‌కో పంచాయతీకి సంబంధించి సర్వీసులను తొలగించడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.1400 కోట్లు జమకాగా, ఆ నిధుల్లో నుంచి సుమారు రూ.350 కోట్లు పంచాయతీల నుంచి ముక్కుపిండి వసూలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. రేపు సోమవారంలోపు బిల్లులు చెల్లించాలని హుకుం జారీచేశారు. పలు పంచాయతీలు బిల్లులు చెల్లించేందుకు సమాయత్తం అవుతుండగా ట్రాన్స్‌కో అధికారులు శనివారం ఆకస్మికంగా కరెంట్ సర్వీసులు తొలగించి సర్పంచ్‌లకు కనీస మర్యాద ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన నావికాదళ విన్యాసాలు





విన్యాసాలను ప్రదర్శిస్తున్న దృశ్యాలు

సర్పవరం జంక్షన్, మార్చి 30 : కాకినాడ సముద్ర తీరంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఎక్స్ టైగర్ ట్రయంఫ్-24 సీ ఫేజ్ విన్యాసాలు శనివారంతో ముగిశాయి. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో భారత-అమెరికా యాంపిబీఎస్ విన్యాసాల్లో భాగంగా ఇరు దేశాలకు చెందిన సుమారు 1100 మంది త్రివిధ దళాల సైనికులు, అధికారులు ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన సైనిక విన్యాసాలు దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణాన్ని తలపించేలా జరిగాయి. నింగి, నేల, సముద్ర ప్రాదేశిక జలాల్లో మోహరించిన ఇరు దేశాల యుద్ధ నౌకలు ఒకవైపు, శత్రువుల శిబిరాలను గుర్తించి యుద్ధ హెలికాప్టర్ల ద్వారా బాంబుల మోత మరోవైపు, సముద్ర తీరంలో భూమిపై నుంచి అత్యాధునిక సైనిక ఆయుధాలు చేతబట్టిన ఆర్మీ సిబ్బంది మరోవైపు శత్రుసేనలపై విరుచుకుపడి యుద్ధ క్షేత్రాన్ని తలపించేలా త్రివిధ దళాల సైనికులు నిర్వహించిన సైనిక కసరత్తు ఆద్యంతం తీవ్ర ఉత్కంఠకు దారితీశాయి. తుపాన్లు, విపత్తుల సమయంలో సాయం, వైద్యం అందించడం, శత్రు దేశాలు భూ ఆక్రమణకు దిగడం, యుద్ధ సమయంలో సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇరుదేశాల త్రివిధ దళాలు కదనం రంగంలోకి దిగి భూమి, సముద్రం, ఆకాశయానం ద్వారా త్రివిధ దళాలు యుద్ధ నైపుణ్యాలను ప్రదర్శించాయి. ఈ దాడుల్లో యుద్ధ ట్యాంకులు, యుద్ధ నౌకలు, సైనిక హెలికాప్టర్లు, జెట్ విన్యాసాలు, ప్రత్యేక వెసల్స్ మెకనైజ్డ్ లాంగ్ క్రాఫ్టులు, ఐఎన్ఎస్ ఐరావత్, జలస్వ, కేసరి వంటి యుద్ధ నౌకలు పాల్గొని సామర్థ్యాలను ప్రదర్శించాయి. వీటితో పాటు అమెరికాకు చెందిన ల్యాండింగ్ క్రాఫ్ట్ ఎసల్ట్, జర్మన్ యుద్ధ టౌన్ నౌక, ఎయిర్‌క్రాఫ్టులు, చేతక్ హెలికాప్టర్లు తదితర యుద్ధ బృందాలు నాలుగు రోజుల పాటు సాగిన విన్యాసాల్లో పాల్గొని తమ సామర్థ్యాలను ప్రదర్శించారు. ఈ విన్యాసాలను నేవీ రియల్ అడ్మిరల్ ఫ్లాగ్ ఆఫీసర్ రాజేష్ ధనకర్, ఆర్మీ మేజర్ జనరల్ అఖిలేష్‌కుమార్, అమెరికా నేవీ రియర్ అడ్మిరల్ వైస్ కమాండర్ జాక్విన్ మార్టినైజ్‌లు పాల్గొని, త్రివిధ దళాలు నిర్వహించిన విన్యాసాలను తిలకించి, పలు సూచనలు చేశారు. అలాగే యుద్ధం, ఆపద సమయంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు అందించే ఫస్ట్ ఎయిడ్, ఆపరేషన్, వైద్య సేవల శిబిరాలను సందర్శించారు. కాకినాడ బీచ్ నుంచి ఉప్పాడకు వెళ్లే వాహనాలను ఆదివారం నుంచి అనుమతించనున్నట్లు తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు.

విధుల నుంచి వలంటీర్లు దూరం

- కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం..
- సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు స్వాధీనం చేసుకోవాలని ఆదేశం
- సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయించే యోచన?

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీకి ఎన్నికల కమిషన్ తేరుకోలేని షాక్ ఇచ్చింది. పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి వలంటీర్లను తప్పించింది. అంతే కాక వారి వద్ద ఉన్న ప్రభుత్వం సెల్‌ఫోన్లను కూడా వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. దీంతో జిల్లాలోని వైసీపీ నేతల్లో కలకలం మొదలైంది. వలంటీర్ల చేత పింఛన్లు పంపిణీ చేయించి.. అదే సమయంలో ఓటు వైసీపీకి వేయవలసిన అవసరం గురించి చెప్పించడానికి వైసీపీ పెద్ద కుట్ర చేసిన సంగతి తెలిసిందే. వలంటీర్ల చేత చెప్పిస్తే కొందరైనా వింటారనే ఆలోచనతో వైసీపీ నేతలు వ్యూహం పన్నారు. మొదట్లో రాజకీయ పార్టీల సమావేశాలకు వెళ్లవద్దని ఆదేశించినా నేతల ఒత్తిళ్ల వల్ల కొందరు వెళ్లి ఆ కాస్త ఉద్యోగం పోగొట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ విధంగా రాజమహేంద్రవరంలో 24 మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా వలంటీర్ల చేత రాజీనామాలు చేయించి వారితో పనిచేయించుకునే ఆలోచన కూడా వైసీపీ నేతలు కొందరు చేశారు. దీంతో 16 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. అంతేకాక ఎన్నికల ముందు ఏప్రిల్ 1, మే 1వ తేదీల్లో కూడా పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నందున వారికి వలంటీర్ల చేత పింఛన్లు ఇప్పించి, ఓటు వైసీపీకి వేయాలని చెప్పించే ప్రయత్నంలో ఉన్నారు. ఇది పసిగట్టిన ఎన్నికల కమిషనర్ జోక్యం చేసుకుని, పింఛన్ల పంపిణీలో వలంటీర్ల పాత్ర ఉండకూడదని, వారినుంచి ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లు కూడా స్వాధీనం చేసుకోవాలని, ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. వలంటీర్ల ఫోన్లలో తన పరిధిలోని ఓటర్ల పూర్తి వివరాలు ఉంటాయి. వారితో వాట్సాప్ గ్రూపు కూడా ఏర్పాటు చేశారు. ప్రతి సమాచారం వాట్సాప్ ద్వారా అందిస్తున్నారు. ఇక వాట్సాప్, ఫోన్, మెసేజ్ ద్వారా కూడా ఓటర్లను ప్రభావితంగా చేయకుండా ఉండే విధంగా వారి ఫోన్లను స్వాధీనం చేసుకోమని ఆదేశించింది. దీంతో వైసీపీ కంగారు పడుతోంది. జిల్లాలో సుమారు రెండు లక్షల 45 వేలు పింఛన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 9146 మంది వలంటీర్లు వీటిని పంపిణీ చేసేవారు. ఇటీవల వారి సంఖ్య బాగా తగ్గింది. ఇవాళ వీరిని ఆపేయడంతో పాటు వాటన్నింటిని ఒకటి నుంచి పంపిణీ చేయడానికి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులతో ఈ పంపిణీ చేయించే ఆలోచన చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఏ గైడ్‌లైన్స్ వస్తాయోనని ఎదురు చూస్తున్నారు.

మావోయిస్టుల కరపత్రాలు



ఎటపాక, మార్చి 30: రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో రెండు చోట్ల శనివారం వెలసిన (భారత కమ్యూనిస్టు పార్టీ) మావోయిస్టు కరపత్రాలు కలకలం రేపాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెండు రాష్ట్రాల సరిహద్దులో కరపత్రాలు దర్శనం ఇవ్వడంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఎటపాక మండలం, సరిహద్దు గ్రామాలైన కన్నాయిగూడెం గ్రామ శివారు ప్రాంతంతో పాటు చెన్నంపేట- సీతంపేట గ్రామాల మధ్యలో అల్లూరి డివిజన్ కమిటీ, చర్ల-శబరి ఏరియా కమిటీ పేరుతో మావోల పోస్టర్లు వెలిశాయి. పోస్టర్లను చెట్లకు, నేలపై వదిలివెళ్లారు. పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీని, దాంతో అంటకాగుతున్న పార్టీలన్నింటినీ తన్ని తరమాలని పేర్కొన్నారు. బ్రాహ్మణీయ, హిందుత్వ ఫాసిస్టు ప్రమాదం నుంచి దేశాన్ని, ప్రజలను కాపాడమంటూ పేర్కొన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలపై జరుగుతున్న ఘోరాలు దేశంలో అన్ని ప్రాంతాల్లో జరుగుతాయని, మతోన్మాద శక్తులనే ఓడించాలన్నారు. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో మావోల పోస్టర్లు దర్శనం ఇవ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే పోస్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

నిపుణులైన సర్జన్లుగా ఎదగాలి

రాజానగరం, మార్చి 30: జీఎస్ఎల్ దంత వైద్య కళాశాలలో ఉన్నత ప్రమాణాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలను వినియోగించుకుని మంచి దంత వైద్య సర్జన్లుగా ఎదగాలని న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్) దంత వైద్య పరిశోధన విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆర్థోడాంటిస్ట్ డాక్టర్ రీతూ దుగ్గల్ అన్నారు. జీఎస్ఎల్ డెంటల్ కళాశాల దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ముగింపు సభలో ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జీఎస్ఎల్ డెంటల్ కళాశాలలో విద్య నభ్యసించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా దంత వైద్య విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. జీఎస్ఎల్ డెంటల్ కళాశాల మెంటార్ డాక్టర్ గన్ని సందీప్ మాట్లాడుతూ పెద్ద పట్టణాలు, నగరాలకు మాత్రమే పరిమితమైన దంతవైద్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ ప్రాంతంలో స్థాపించామన్నారు. అనంతరం దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ గంటా సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆదాయం రూ.12 లక్షలు

ఐ.పోలవరం, మార్చి 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల వీరేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం శనివారం దేవదాయశాఖ సహాయ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. 70 రోజులకు ప్రధాన హుండీ ఆదాయం రూ.5,57,638లు, నిత్యకల్యాణ కట్నకానుకల హుండీ ఆదాయం రూ.4,95,233, అన్నదానం హుండీ ఆదాయం రూ.1,58,085 వెరసి మొత్తం ఆదాయం రూ.12,10,956 వచ్చింది. దీంతో పాటు ఒక విదేశీ డాలర్, ఒక టైటానిక్ వాచ్ వచ్చినట్టు తెలిపారు. ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు, మట్టపర్తి శివరాంబాబు, ఆలయ అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శృంగారవల్లభస్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, మార్చి 30: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టికెట్ల విక్రయం ద్వారా రూ. 2,26,700 అన్నదాన విరాళాలు ద్వారా రూ. 41,444 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 8,240, తులాభారం రూ.400 వెరసి రూ.3,38,655 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

బాలబాలాజీకి రూ.2.13 లక్షల ఆదాయం

మామిడికుదురు, మార్చి 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారికి శనివారం వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,13,043 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వైనతేయ నదిలో భక్తులు స్నానమాచరించి స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. స్వామివారిని 3,174 మంది దర్శించుకుని 2,358 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఏసీ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. నిత్యాన్నదాన పథకానికి ఆచంట మండలం కొడమంచిలికి చెందిన తాళ్లూరి రామచంద్రరావు-సూర్యచంద్రావతి దంపతులు రూ.10 వేలు విరాళంగా అందించారు

సీఎంఆర్ జ్యువెలరీ మాల్ ప్రారంభం



షోరూం ప్రారంభించిన అమృతతో మావూరి కుటుంబం

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 30: కాకినాడలో సీఎంఆర్ జ్యువెలరీ మాల్‌ను శనివారం సాయంత్రం హనుమాన్ చిత్రం హీరోయిన్ అమృత అయ్యర్ ప్రారంభించారు. స్థానిక దేవాలయంవీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ మాల్‌ను ప్రారంభించి, నగలను ధరించి కనువిందు చేశారు. ఆమెను చూసేందుకు అభిమానులు తరలివచ్చారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు నాణ్యతతో కూడిన బంగారు ఆభరణాలను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాకినాడ రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. సీఎంఆర్ గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా ఆభరణాలు రూపొందిస్తున్నామని అన్నారు. బంగారు ఆభరణాలపై తరుగు 3 శాతం, వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదన్నారు. సంస్థ ఎండీ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ ప్రస్తుత తరానికి తగ్గట్టుగా సరికొత్త డిజైన్‌లతో ఆభరణాలు తయారు చేయిస్తున్నామన్నారు. మాల్ ప్రారంభం సందర్భంగా గ్రాముకు రూ.250 తగ్గింపు ఇస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ సీఈవో వైఎల్ చౌదరి, ద్వారంపూడి వీరభద్రారెడ్డి, రాపాక వెంకట్ ఆనంద్, పి.మంగరాజు, బాదం సుందరరావు, పెద్ది రత్నాజీ, గొడవర్తి లక్ష్మీలావణ్య పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట



తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం, మార్చి30: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని ప్రాకార మండపంలో క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.49.84 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

శనీశ్వర ఆలయంలో పూజలు

కొత్తపేట, మార్చి 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి శనీశ్వర(మందేశ్వర) ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సర్వదర్శనాలకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,15,059 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

'రివర్‌బే'లో విజిలెన్స్ తనిఖీలు

అన్నీ ఉల్లంఘనలే.. కేసులు నమోదు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లలో వంట గదులు పరిశుభ్రంగా ఉండాల్సిందేనని.. వినియోగదారులకు నాణ్యమైన, తాజాగా, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను అందించకపోతే చట్టపరంగా చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. నగరంలోని రివర్‌బే హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలిసి ఎస్పీ సోదాలు చేశారు. పలు ఉల్లంఘనలను గుర్తించి కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్పీ వివరాల ప్రకారం.. హోటల్‌లో వాడుతున్న నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్(టీపీసీ) మీటర్ రీడింగ్ చూడగా 25% కంటే ఎక్కువగా ఉండడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేశారన్నారు. అలాగే మునిసిపాలిటీకి ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించడం లేదన్నారు. ఆ బకాయిలు రూ.13,77,220 ఉండడం గుర్తించామన్నారు. తూనికల యంత్రానికి నిబంధనల ప్రకారం అనుమతుల లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారన్నారు. వ్యాపారానికి సంబంధించి జీఎస్టీ రిటర్నులు గత ఏడాది సెప్టెంబరు నుంచీ ఫైల్ చేయలేదన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాల నాయుడు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీ విజిల్ బృందాలతో నోడల్ అధికారి సమీక్ష

మండపేట, మార్చి 30: మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల సీ విజిల్ బృందాలతో శనివారం మండలపరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి, నోడల్ అధికారి రాంబాబు సమీక్ష నిర్వహించారు. సీ విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై సభ్యుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఎంసీసీ పరిధిలోకి వచ్చే అంశాలు, వాటి పరిష్కారం సంబంధిత విధివిధానాలను రాంబాబు వివరించారు. మండపేట తహసీల్దార్ సురేష్‌బాబు, రామచంద్రపురం డీఎల్పీవో ఎ.రాజు పాల్గొన్నారు.

- కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు
- రెడ్డిపల్లిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం
- సైకిల్ గుర్తుపై ఓట్లువేసి గెలిపించాలని విజ్ఞప్తి

‘దళితుల ఓట్లను అడిగే హక్కు వైసీపీకి లేదు’


మేనిఫెస్టో క్యాలెండర్‌ను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ముమ్మిడివరం, మార్చి 30: దళిత ఓట్లతో గద్దెనెక్కి దళితులను అన్ని రంగాల్లో అణగదొక్కిన సీఎం జగన్‌కు దళితుల ఓట్లను అడిగే నైతిక హక్కు లేదని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు(బాలు) పేర్కొన్నారు. శనివారం కర్రివానిరేవు గ్రామం బూరుగపేటలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మేనిఫెస్టో కేలండర్లను ఇంటింటికీ పంచారు. ఈసందర్భంగా పొద్దోకు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలుచేసిన 27దళిత సంక్షేమ పథకాలను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రద్దుచేసి దళితుల అభివృద్ధిని అడ్డుకుందన్నారు. కూటమి అభ్యర్థులు దాట్ల బుచ్చిబాబు, గంటి హరీష్‌మాధుర్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో దాట్ల పృథ్విరాజ్, చెయ్యేటి శ్రీనుబాబు, మిమ్మితి చిరంజీవి, అర్ధాని శ్రీనివాసరావు, చిక్కాల అంజిబాబు, అయినవిల్లి వలీబాబా, మట్ట సుభాషిణి, రాహుల్, కుంచే ప్రసాద్, రేకాడి రాంబాబు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, ముమ్మిడివరం వరలక్ష్మి, కుంచే శ్రీను, సబ్బతి డేవిడ్‌రాజు, పోతుమూడి వెంకటేశ్వరరావు, గెద్దం శ్రీరామచంద్రమూర్తి, దోనేపూడి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ కూడా నిర్వహించలేకపోతున్నాం

కౌన్సిల్ సమావేశంలో ఫ్లోర్ లీడర్ ములపర్తి


మాట్లాడుతున్న వైస్‌చైర్‌పర్సన్ రెడ్డి హేమసుందరి

ముమ్మిడివరం, మార్చి 30: నగర పంచాయతీ పరిధిలోని వార్డుల్లో కనీసం శానిటేషన్ కార్యక్రమం సరిగా నిర్వహించలేకపోతున్నాం, దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ నగర పంచాయతీ ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వైస్‌చైర్‌పర్సన్ రెడ్డి హేమసుందరి అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని, దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ విభాగ ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరు కారణంగా నగర పంచాయతీ లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతుందని, టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని బాలకృష్ణ డిమాండు చేశారు. బాలయోగి ఆశ్రమం సమీపంలో 2023లో వేసిన ఓ వెంచర్‌లో బిల్డింగ్ ప్లాన్‌కు అప్రూవల్ ఇచ్చారు. 2020లో వేసిన బిల్డింగ్ ప్లాన్‌కు అప్రూవల్ అడిగితే తిరస్కరించారని, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కొక్క విధంగా ఉంటుందా అని ప్రశ్నించారు. కొండాలమ్మ చింత సమీపంలో 252/6 సర్వే నంబరులో పంట పొలాలకు ముగుగు నీరు దిగే బోదిని కప్పివేసి వెంచర్ వేశారని, దీనిపై ఫిర్యాదు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు కనీస చర్యలు చేపట్టలేదని బాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేయడంతో కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి స్పందించి సమగ్ర వివరాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎజెండాలో ప్రవేశపెట్టిన పనులకు సంబంధించి ఖర్చుల లెక్కలు స్పష్టంగా చూపాలని బాలకృష్ణ సూచించారు. సమావేశంలో 1వ పద్దు కింద వివిధ పనులకు సంబంధించి రూ.8,76,508 జమలుగాను రూ.2,51,051 ఖర్చులుగాను, 2వ పద్దు కింద రూ.5,78,751 జమలుగాను చూపెడుతూ ప్రవేశపెట్టిన ఆదాయ, వ్యయ బిల్లులను సమావేశం ఆమోదించింది. సమావేశంలో వైస్‌చైర్మన్ వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో క్రైస్తవుల రన్‌ఫర్ జీసస్

ద్రాక్షారామ, మార్చి 30: ద్రాక్షారామలో క్రైస్తవులు శనివారం రన్‌ఫర్ జీసస్ నిర్వహించారు. ద్రాక్షారామ పరిసర ప్రాంతాల పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం వెలంపాలెం నుంచి ప్రారంభించి ద్రాక్షారామలో బోసుబొమ్మ సెంటర్ మీదుగా తోటపేట ఆర్‌సీఎం చర్చి వరకు జరిగింది. ఏసు తిరిగి లేచెను..అంటూ పునరుద్ధారణ అయిన క్రీస్తును ప్రకటించారు. రెవ. ఆకుమర్తి సామ్యూల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాస్టర్లు అసోసియేషన్ అధ్యక్షుడు తాటి కొండ, కోకన్వీనర్ పి.విజయరత్నం, చైర్మన్ గంపల సత్యానందం, నక్క సతీష్‌బాబు, వి.ఎస్.ప్రసాద్, వి.ఆశీర్వాదం పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి నుంచిలక్కవరం వరకు శనివారం రన్ ఫర్ జీసెస్ సువార్త దండయాత్ర నిర్వహించారు. డాక్టర్ శామ్యూల్ పిన్నీ, డాక్టర్ స్పర్జన్‌కింగ్, దేవ ప్రవీణ్, పాలపర్తి శేఖర్‌ల ఆధ్వర్యంలో సేవకులు, విశ్వాసులు, సువార్తికులు, యూత్, వివిధ సంఘాలతో కూడిన పలువురు రన్ ఫర్ జీసెస్ ర్యాలీ నిర్వహించారు. గంటా షారోన్, బుంగ సాల్మన్‌రాజు, బి.షాలెం, నల్లి కిశోర్, పి.సంతోష్‌కుమార్, సీహెచ్ ఆండ్రూస్‌సురేష్, ఎస్ఆర్ షాలెంరాజు, రన్‌ఫర్ జీసెస్ ఆర్గనైజింగ్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. సఖినేటిపల్లి, మలికిపురం మండలాల పాస్టర్లు పాల్గొన్నారు.

మండపేట: మండపేటలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం శనివారం జరిగింది. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొని ఏసుక్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయమన్నారు. ప్రేమ,సహనం, శాంతిని పంచిన కరుణామయుడు ఏసుప్రభువని ఆయన కీర్తించారు. పాస్టర్ పెలోషిప్ జిల్లా అధ్యక్షుడు డేనియల్‌పాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాస్టర్ రెవ. సీహెచ్.ఉదయ్‌బాస్కర్, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఇస్రోకి యానాం నవోదయ విద్యార్థి ఎంపిక

యానాం, మార్చి 30: ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమం యువికాకు యానాం జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థి బండారు దుర్గేష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. దేశంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల విద్యార్థులకు ఇస్రో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షల్లో దుర్గేష్ ఎంపికయ్యాడు. అంతరిక్ష శాస్త్ర, దేశ భవిష్యత్ నిర్మాణం కొరక విద్యార్థులకు సాంకేతిక పరిశోధనా జ్ఞానాన్ని అందిస్తారని ప్రిన్సిపాల్ అన్నారు.

పీఎంశ్రీకి యానాం నవోదయ విద్యాలయం ఎంపిక

ప్రభుత్వ పాఠశాలకు మెరుగైన, నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోది ప్రారంభించిన ఎంపిశ్రీ పథకానికి యానాం జవహర్ నవోదయ విద్యాలయం ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. ఈపథకం ద్వారా ప్రస్తుత సౌకర్యాలతో పాటు డిజిటల్ విద్యా విధానాన్ని అమలు చేస్తారని, రక్షిత మంచినీరు, ఎల్ఈడీ విద్యుద్దీకరణ, వేస్ట్ మేనేజ్మెంట్, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై సంప్రదాయ విధివిధానాలను నేర్పించేందుకు ఆర్థిక సహాయం అందజేస్తారన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

అమలాపురం రూరల్, మార్చి 30: ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ ఎస్.శ్రీధర్ సూచించారు. ఎన్నికల విషయమై ప్రజలకు భరోసా కల్పించేందుకు స్థానిక పోలీసులతో కలిసి కేంద్ర బలగాలు శనివారం జనుపల్లిలో కవాతు నిర్వహించారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక గ్రామాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. జనుపల్లి, నల్లమిల్లి, ఎ.వేమవరం గ్రామాల్లో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

జగన్ అరాచకాల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం




అమలాపురం: రెడ్డిపల్లిలో ఇంటింటా ప్రచారంలో ఆనందరావు, కాట్రేనికోన: టీడీపీలో చేరిన బలుసుతిప్ప మత్స్యకారులతో దాట్ల బుచ్చిబాబు, ఆత్రేయపురం: వైసీపీ నుంచి టీడీపీలో చేరిన యువఓటర్లతో బండారు సత్యానందరావు

అమలాపురం రూరల్, మార్చి 30: జగన్ అరాచకాల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు, అభివృద్ధిచేసి సంక్షేమ పథకాలను అమలు చేయడం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కరాటం సూర్యభాస్కరరావు, మండలశాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య ఆధ్వర్యంలో శనివారం రెడ్డిపల్లిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓట్లువేసి చంద్రబాబును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, వివిధ విభాగాల నాయకులు రాజులపూడి భీముడు, పొలమూరి ధర్మపాల్, అరిగెల నానాజీ, దెందుకూరి సత్తిబాబురాజు, దంతులూరి వాసురాజు, మంద గెద్దయ్య మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, పెద్దిరెడ్డి రాము, నడింపల్లి ఉదయబాబు, చొల్లంగి సత్యసాయిబాబా, జనసేన నాయకులు ఏడిద శ్రీను, కొప్పుల నాగమానస, పడాల నానాజీపాల్గొన్నారు.

టీడీపీలోకి బలుసుతిప్ప మత్స్యకారులు

కాట్రేనికోన, మార్చి 30: బలుసుతిప్పకు చెందిన 300మంది మత్స్యకారులు శనివారం సంగాని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మురమళ్ళలో టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఎన్నికల్లో బుచ్చిబాబు విజయానికి కృషి చేస్తామని వారు అన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి తాను కట్టుబడి ఉన్నానని బుచ్చిబాబు హామీఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ ఓలేటి గంగరాజు, ఎంపీటీసీ తిరుమాని పద్మావతీవీరబాబు, కోలా మారేష్, సంగాని రాంబాబు, ఓలేటి గంగాద్రిరావు, పెమ్మాడి అప్పారావు, పెమ్మాడి వెంకటేశ్వర్లు, సంగాని భూలోకం, సంగాని ఈశ్వరరావు, సంగాని ధర్మారావు, పెమ్మాడి శ్రీను, ఓలేటి శ్రీను, వనమాడి సత్యనారాయణ, మల్లాడి గోవిందు, ఇసుకపట్ల సింహాద్రి, ఇసుకపట్ల వినోద్, కామాడి ఈశ్వరరావు, సంగాని సత్యం, వైదాని వీరబాబు, వైదాని దొరబాబు, సంగాని పేర్రాజు, పొన్నాడి గంటలయ్య, పొన్నాడి వీరబాబు, పొన్నాడి తాతాలు, కర్రి శ్రీను, దండుప్రోలు లక్ష్మణస్వామి,దండుప్రోలు ధర్మారావు, దండుప్రోలు శ్రీను, కామాడి అగ్గిరాజు, ఓలేటి భైరవస్వామి, పెమ్మాడి శ్రీను, సంగాని గణపతి, దోమ సత్తిబాబు, చక్కా మురళి, వైదాని అబ్బి, వైదాని సత్తిబాబు, దోమ శివ, ఓలేటి శివ ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, ముదునూరి రామలింగరాజు, దండుప్రోలు సత్యం పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటు వేస్తాం: యువ ఓటర్లు

ఆత్రేయపురం, మార్చి 30: త్వరలో జరిగే ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు పొందిన దళిత యువకులు చంద్రబాబుకే ఓటు వేస్తామని ప్రకటించారు. శనివారం రాత్రి టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు నాయకత్వంలో ఆత్రేయపురానికి చెందిన 30మంది దళిత యువ ఓటర్లు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరందరికీ కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో తోటకూర సుబ్బరాజు, కప్పల సునీల్, కాకి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందుండాలి

ఆర్యవైశ్యులు సమాజ సేవలో మరింత చురుకైన పాత్ర పోషించాలని అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. శనివారం ఆత్రేయపురం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయప్రాంగణంలో మండల ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. మండలఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడి పీవీవీఎస్ నాగేశ్వరరావు, సెక్రటరీ కె.రామచంద్రమూర్తి, వైస్‌ప్రెసిడెంట్ సీహెచ్.శేషారావు, ట్రెజరర్ వీఎస్‌వీ సుబ్రహ్మణ్యం, కార్యకర్గ సభ్యులను దుశ్శాలువాతో సత్కరించారు.

ఆక్వాతో మెండుగా జీవనోపాధి

అమలాపురం టౌన్, మార్చి 30: జిల్లాలో ఆక్వాకల్చర్‌కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని, దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి జీవనోపాధి లభిస్తుందని ఆంధ్రా యూనివర్సిటీ గణితశాస్త్ర విభాగాధిపతి, మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ జానకీరామ్ పేర్కొన్నారు. శనివారం అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో గ్లోరియస్ అలుమిని ఆధ్వర్యంలో ఆక్వాకల్చర్‌లో అవకాశాలు-సమస్యలు అనే అంశంపై జానకీరామ్ సుదీర్ఘంగా ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ కుమారశాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో జంతుశాస్త్ర విభాగాధిపతి ఎ.రవీంద్ర, డాక్టర్ ఎస్.గాయత్రీదేవి, పి.త్రినాథరావు, డాక్టర్ ఎ.రాజు పాల్గొన్నారు.

దంగేరు సర్పంచ్‌ను కలిసిన సుభాష్

కె.గంగవరం, మార్చి 30: దంగేరు సర్పంచ్ కొప్పిశెట్టి వెంకట రమణను టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ శనివారం కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ నాయకులు మరివాడ చిన్నికృష్ణ, మేడిశెట్టి రవికుమార్, సలాది రమేష్, జగతా రమణ, దంగేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కాట్రేనికోన, మార్చి 30: కుండలేశ్వరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ శనివారం జరిగింది. కాకినాడకు చెందిన వనచర్ల రవీంద్రనాథ్ కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అన్నసమారాధన జరిగింది. కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పూజల్లో పాల్గొన్నారు.

ముస్లింల మద్దతు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 30: వైసీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌కు పట్టణానికి చెందిన ముస్లింలు ఎస్.ఎం అహ్మద్, ఎం.డి.రఫీక్ హుద్దీన్, ఎం.డి.అహ్మద్‌అలీ, సయ్యద్ జహంగీర్, ఎస్.కె.మీర్జాన్, ఎస్.కె.రహమాన్, ఎస్.కె.కుర్బాన్ మద్దతు ప్రకటించారు. సూర్యప్రకాష్, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను పట్టణ కార్యాలయంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, శెట్టిబలిజ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ పాలిక శ్రీను కలిశారు.

కూటమి ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురుచూపులు

గంటి హరీష్‌మాధుర్, దేవ వరప్రసాద్


ప్రచారం చేస్తున్న హరీష్‌మాధుర్, దేవవరప్రసాద్

అంతర్వేది, మార్చి 30: టీడీపీ, జనసేన, బీజేపీ అమలాపురం పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, రాజోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్‌లు అంతర్వేది దేవస్థానం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. శనివారం ఉదయం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో వారు పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రచార చైతన్య రథానికి పూజలు జరిపారు. అనంతరం ప్రచారాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా హరీష్‌మాధుర్ మాట్లాడుతూ వైసీపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ప్రజలంతా తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. దేవ వరప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు నష్టపోయారన్నారు. అంతర్వేది దేవస్థానం పల్లవపాలెం, గొంది, గుడిమూల, రామేశ్వరం, సఖినేటిపల్లి, అంతర్వేదిపాలెం వరకు ప్రచారం కొనసాగింది. కార్యక్రమంలో గుండుబోగుల చినబాబురాజు, రుద్రరాజు వెంకట్రామరాజు, నామన రాంబాబు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, గుండుబోగుల పెదకాపు, రాష్ట్ర చేనేత సంఘ నాయకుడు చింతా వీరభద్రేశ్వరరావు, ముప్పర్తి నాని, గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, రాపాక నవరత్నం, బందెల పద్మ, మంగెన భూదేవి, మాజీ ఎంపీపీ పప్పుల లక్ష్మీసరస్వతి, పోతురాజు కృష్ణ, వనమాలి మూలాస్వామి, తిరుమాని ఆచార్యులు, చెల్లుబోయిన శ్రీనివాస్, చెల్లింగి సత్యనారాయణ, కాండ్రేగుల రాము, కౌరు శ్రీనివాస్, పప్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాయిరామ్


సాయిరామ్‌ను అభినందిస్తున్న సహచరులు

అమలాపురంటౌన్, మార్చి30: అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలు శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి వీరిన సాయిరామ్, కుడుపూడి అశోక్‌లు పోటీ పడ్డారు. ఈపోటీలో సాయిరామ్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల అధికారిగా కటికదల సత్యనారాయణ పర్యవేక్షకులుగా గంటి రామగోపాల్, కె.నానాజీ, ఎన్.వెంకన్న, ఎస్వీ కృష్ణమూర్తిలు వ్యవహరించారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షునిగా పల్నాటి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా నందిగ శ్రీనివాస్, కార్యదర్శిగా సీహెచ్ఎస్ఆర్కే నాగేశ్వరరావు, గ్రంథాలయ కార్యదర్శిగా గుండాబత్తుల బాలరవితేజ, కోశాధికారిగా సయ్యద్ హమీద్ బాషాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా అడపా వెంకటసత్యప్రసాద్, మహ్మద్‌ఇక్బాల్, మాకిరెడ్డి ఆదినారాయణ, మోకా సత్యనారాయణ, వరలక్ష్మి నరసింహారావు, నందెపు చినవెంకటేశ్వరరావు, రాపాక దేవదీవెన, బుడితి వెంకటరమణ ఎన్నిక కాగా పలువురు అభినందించారు.

నేత్ర దానం

కె.గంగవరం, మార్చి30: యండగండికి చెందిన పుట్టా తిరుపతి వెంకట్రావు(84) అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అంగీకరించడంతో కాకినాడ బాందం బాలకృష్ణ ఐబ్యాంకు ప్రతినిధులు నేత్రాలు సేకరించారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



అమలాపురం టౌన్, మార్చి 30: అమలాపురం శ్రీస్వామివివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని అంతర్జాతీయ యోగా న్యాయ నిర్ణేత మోటూరి భైరవస్వామి పేర్కొన్నారు. యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న బి.మేఘన, వి.శ్రావణి, వి.సారికలు అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన ఆశ్రమ గురువు ఆకుల శ్రీనివాస్‌ను శనివారం ఆయన అభినందించారు.

ఇమామ్ హజరత్ అలీకి ఘన నివాళి

మామిడికుదురు, మార్చి 30: ముస్లిం మతస్తుల ఆరాధ్య దైవం, పన్నెండు ప్రవక్తల్లో మొదటి ప్రవక్త ఇమామ్ హజరత్ అలీకి ముస్లింలు ఘన నివాళులర్పించారు. ఆయన వర్ధంతి సందర్భంగా శనివారం షియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. శిరస్సుపై ఖురాన్ ఉంచి ప్రార్థనలు చేశారు. మత ప్రబోధకులు షబ్బర్ అలీజైదీ ఆధ్వర్యంలో మజ్లిస్ జరిగింది. నగరంలోని పెదపంజీషాలో మత ప్రబోధకులతో మజ్లిస్, ప్రార్థనలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ

మండపేట, మార్చి 30: 18ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు వినియోగంపై శనివారం ఏడిదలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో ఆర్.శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

రావులపాలెం, మార్చి 30: ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ముమ్మిడివర్పాడుకు చెందిన దిగుమర్తి గణేష్(18) శుక్రవారం స్నేహితులతో కలిసి గోపాలపురం వద్ద ఉన్న గన్నవరం ప్రధాన పంటకాలువులో స్నానానికి దిగాడు. అక్కడ కాలువ ప్రవాహం వడిగా ఉండటంతో కాలువలో కొట్టుకుపోయాడు. సీఐ అంజనేయులు ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: కలియుగ పట్టణంలో
వెంకటరమణ	: ప్రేమలు
శ్రీలలిత	: గో ఎట్ లైఫ్
శేఖర్ స్క్రీన్-1	: ఓం భీమ్‌బుష్
శేఖర్ స్క్రీన్-2	: తలకోన
రమా	: డీజేటిల్లు స్క్వేర్
గణపతి	: ఊరిపేరు భైరవకోన
వెంకటపద్మావతిస్క్రీన్-1	: డీజేటిల్లు స్క్వేర్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గాడ్జిల్లా అండ్‌కాంగ్

బీసీలంతా టీడీపీ, జనసేన అభ్యర్థుల విజయానికి కృషిచేయాలి

ముమ్మిడివరం, మార్చి 30: బీసీలంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని టీడీపీ నాయకుడు గుత్తుల సాయి పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అర్ధాని శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు ఉన్నత రాజకీయ పదవులు ఇచ్చి వారికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చింది టీడీపీ అని పేర్కొన్నారు. గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, పొత్తూరి విజయభాస్కరవర్మ, పిల్లి నాగరాజు, నడిమింటి సూర్యప్రభాకరం, మట్ట సత్తిబాబు, యాళ్ల ఉదయ్, దంగేటి శ్రీను, వీసాల చంద్రరావు, కొప్పిశెట్టి శేర్, రెడ్డి సుబ్బారావు, చిక్కాల అంజిబాబు, ఇళ్ల ఏడుకొండలు, గోదశి గణేష్, చప్పిడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

50శాతం లాభంతో మద్దతు ధర

ఉప్పలగుప్తం, మార్చి 30: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతాంగానికి సాగు పెట్టుబడిపై 50శాతం లాభంతో ధాన్యానికి కొత్త మద్దతు ధర ప్రకటిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గెడ్డం సురేష్‌బాబు అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు రైతులకు రూ. 2లక్షల వరకు రుణ మాఫీ చేస్తామన్నారు. నిరుపేద మహిళలకు ఏడాదికి లక్ష రూపాయలు ఇస్తామన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ఉపాధి కూలీల వేతనం పెంపు, 2.25 ఉద్యోగాల భర్తీ, అర్హులకు పక్కా ఇళ్ళ నిర్మాణంతో పాటు పెన్షన్ల సొమ్ము మొత్తాన్ని పెంచుతామన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జల దినోత్సవం

ముమ్మిడివరం, మార్చి 30: ప్రపంచ జల దినోత్సవ దశ దిన ఉత్సవాల సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గాలిలంకలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. గాడిలంక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.ఉదయ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో జనవిజ్ఞానవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కోలా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నీరు లేనిదే జీవం లేదు. జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ ఎస్.అబ్బులు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి నీటి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జనిపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్డి సుబ్రహ్మణ్యానికి అభినందనలు

రాజోలు, మార్చి 30: పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యాన్ని రాజోలు టీడీపీ నాయకులు పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. రాజోలు, మలికిపురం మండలాల టీడీపీ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, రాపాక నవరత్నం, మామిడిశెట్టి నాగరాజు, గోనిపాటి రాజు, తాడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు సీటు ఇవ్వకుంటే భవిష్యత్ కార్యాచరణ

అల్లవరం, మార్చి 30: జనసేనకు అమలాపురం అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చేలా పునరాలోచన చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ శెట్టిబత్తుల రాజబాబు కోరారు. లేకపోతే వారం రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కోడూరుపాడు గుబ్బలకస్తూరీ కల్యాణ మండపంలో శనివారం జరిగిన సమావేశంలో రాజబాబు వెంటే తామంతా ఉంటామని అభిమానులు ప్రకటించారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసి తాము సీటు కేటాయింపుపై పునరాలోచించాలని కోరుతామన్నారు. సభకు అనుమతి లేదని, సభను నిలిపివేయాలని ఎంపీడీవో కృష్ణమోహన్ సూచించారు. దీంతో జనసేన శ్రేణులు సభను ముగించారు. సందాడి శ్రీనుబాబు, కఠారి సుబ్బారావు, మోకా బాలయోగి, పెన్మత్స సోమరాజు, గోళ్ళ కమల, ముత్యాల మన్నమ్మ, తాళ్ళ రవి, కుంపట్ల నాయుడు, ముత్తాబత్తుల శ్రీను, మామిళ్ళపల్లి దొరబాబు, రొక్కాల నాగేశ్వరరావు, చవల వెంకటేశ్వరరావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

కె.గంగవరం, మార్చి 30: ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ఎస్ఐ జానీబాషా అన్నారు. శనివారం యండగండిలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 18ఏళ్లు నిండి అందరూ ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చోడే గోవిందరాజు, మహిళా పోలీస్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూడలేక లేనిపోని ఆరోపణలు

ఆలమూరు, మార్చి 30: కొత్తపేట నియోజకవర్గంలో బండారు సత్యానందరావుకు పెరుగుతున్న ప్రజాదరణ చూడలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వైసీపీ నాయకులపై టీడీపీ, జనసేన నాయకులు మండిపడ్డారు. చొప్పెల్లలో జరిగిన ప్రజాగళానికి భారీ ప్రజాదరణ రావడంతో బండారు ప్రజలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పేదలకు పథకాలు రాకపోవడంతో బండారు పోరాటాలు చేశారని వారు గుర్తుచేశారు. సమావేశంలో టీడీపీ మెర్ల గోపాలస్వామి, దునే స్వామి నాయుడు, ఈదల నల్లబాబు, రామానుజుల శేషగిరిరావు, వంటిపల్లి సతీష్ కుమార్, కె.సునీల్‌కుమార్, నైనాల శ్రీరామచంద్రమూర్తి, సలాది నాగేశ్వరరావు, వైట్ల శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు, మార్చి 30: సూర్యారావుపేటలో చింతాకుల అనంతలక్ష్మి సారథ్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విజయదుర్గఅమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయంలో వేదపండితులు ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం విగ్రహప్రతిష్ఠ చేశారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, టీడీపీ యువనేత బండారు సంజీవ్, పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఉమ్మడి అభ్యర్థి విజయానికి పూర్తి మద్దతు

అల్లవరం, మార్చి 30: అమలాపురం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావుకు పూర్తి మద్దతు ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు అన్నారు. టీడీపీ ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు దొరబాబును బెండమూర్లంకలో ఆయన స్వగృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, బీజేపీ మండల అధ్యక్షుడు సుంకర సాయి, యాళ్ళ వెంకటానందం, అల్లాడి సోంబాబు, దేగల వెంకటరమణ, లింగం చిన్ని, పరసా కిరణ్, గిడుగు భాస్కరరావు, యాళ్ల ఆదినారాయణ పాల్గొన్నారు.

పోలీస్ అవుట్‌పోస్టు పరిశీలన

యానాం, మార్చి 30: యానాం పోలీస్ అవుట్‌పోస్టును పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్ పరిశీలించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా యానాంవచ్చిన ఆయన స్థానిక రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పోలీస్‌అవుట్‌పోస్టును పరిశీలించారు. యానాంలోని పలు ప్రాంతాలను ఆయన సందర్శించారు. పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగంపాల్గొన్నారు.

పుదుచ్చేరి లోక్‌సభకు 26మంది పోటీ

యానాం, మార్చి 30: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి 26మంది బరిలో ఉన్నారు. శనివారం నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజు కావడంతో స్వతంత్ర అభ్యర్థి ప్రవీణా నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో పుదుచ్చేరిలో 26మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు నమశ్శివాయ, వైద్యలింగం మధ్య పోటీ ఉంటుంది. యానాం నుంచి అరదాడి పోసియ్య స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఆయనకు గాజుగ్లాస్ గుర్తును కేటాయించినట్లు తెలిసింది.

మాజీ ఉపసర్పంచ్ మృతి



కాట్రేనికోన, మార్చి 30: పల్లంకుర్రు మాజీ ఉపసర్పంచ్ తేలు ధర్మారావు(57) మృతిచెందారు. ఆయన సెంట్రల్ రైల్వే డైరెక్టర్‌గా, ఇరిగేషన్ మెంబర్‌గా, టెలికాం డైరెక్టర్‌గా పదవులు నిర్వహించారు. ఆయన మృతికి మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, బీఆర్కే నాయడు, కేవీ నాయుడు సంతాపం తెలిపారు.

ఎన్నికల్లో బూత్ కన్వీనర్ల పాత్ర కీలకం

పి.గన్నవరం, మార్చి 30: సార్వత్రిక ఎన్నికల్లో బూత్ కన్వీనర్ల పాత్ర చాలా కీలకమని ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం కోకోనట్ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి బూత్‌కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి విచ్చేసిన ప్రత్యేక బృందం కన్వీనర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, తాటికాయల వెంకటేష్, తండూరి బుజ్జి, యల్లమిల్లి చిట్టిబాబు, డిల్లీ అరుణ్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.


చేరికల పేరుతో గొల్లపల్లి జిమ్మిక్కులు

అంతర్వేది, మార్చి 30: వైసీపీలో టీడీపీ కార్యకర్తలు చేరుతున్నారంటూ వైసీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చి, జిమ్మిక్కులు చేస్తున్నారని టీడీపీ సఖినేటిపల్లి మండల ఉపాధ్యక్షుడు అయినవిల్లి సత్యనారాయణ ఆరోపించారు. ఇటీవల టీడీపీకి సంబంధం లేనివారు వైసీపీలో చేరితే, వారిని టీడీపీ వారిగా గొల్లపల్లి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో వీరందరూ లాకుపేట సెంటర్ వద్ద వైసీపీ చేరితే, వారికే మళ్లీ కండువాలు కప్పుతున్నారని అన్నారు. సమావేశంలో రావి ధర్మరాజు, అయినవిల్లి ఏడుకొండలు, పులగం రమేష్, కొప్పినీడి శ్రీనివాస్, ఇంజేసి రత్నరాజు, ఎం.నాగు, రుద్రరాజు సూరిబాబురాజు, దొండపాటి బాబూరావు, పొన్నమండ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే చేనేతలకు న్యాయం

మలికిపురం, మార్చి 30: రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడితేనే చేనేత కార్మికులకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర చేనేత నాయకులు చింతా వీరభద్రేశ్వరరావు అన్నారు. గూడపల్లి, అడవిపాలెం, తూర్పుపాలెం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి చేనేత కార్మికులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో చేనేత సమస్యలు పట్టించుకున్న నాథుడే లేడని, మనమంతా ఉమ్మడి ప్రభుత్వాన్ని బలపరచాలని ఆయన ప్రచారం చేశారు. కోనసీమ దేవాంగ సంఘ ఉపాధ్యక్షుడు కటకం ధనలక్ష్మీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తాటిపాక గ్రామ అధ్యక్షుడు చిట్టబ్బాయి మృతి



రాజోలు, మార్చి 30: టీడీపీ తాటిపాక గ్రామశాఖ అధ్యక్షుడు గుద్దటి చిట్టబ్బాయి(57) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. చిట్టబ్బాయి పార్థీవ దేహానికి అమలాపురం పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, రాజోలు నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్, వైసీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, ఎంపీపీ కేతా శ్రీను, టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, మాజీ సర్పంచ్ డాక్టర్ బిక్కిన వీరాస్వామి, బోనం నాగేశ్వరరావు పూలమాలలువేసి నివాళులర్పించారు. సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, కట్టా సూరిబాబు, చిట్టూరి సంతోష్, పోతు కాశి, టీడీపీ, జనసేన నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు. భార్య, ఇద్దరు కుమారులున్నారు.

పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ఉచిత శిక్షణ

కొత్తపేట, మార్చి 30: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఏప్రిల్ 2 నుంచి పాలిటెక్నిక్, ఏపీ ఆర్జేసీ, కేరీర్ గైడెన్స్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పితాని నాగేశ్వరరావు తెలిపారు. ఈశిక్షణ మండల పరిధిలో స్థానికజడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏప్రిల్ 2వతేదీ నుంచి మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకూ అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులు 9705434057కు సంప్రదించి రిజిష్టర్ చేసుకోవాలని, శిక్షణ అనంతరం ఉచితంగా మెటీరియల్ ఇస్తామన్నారు.